

ఇంటి నంబర్ల బాగోతం

హుస్నాబాద్ పట్టణంలో ఎక్కడ ఖాళీ జాగా కన బడితే చాలు కబ్జా పాలవుతుంది. అధికారుల అండదండలతో ఇంటి నంబర్లు కేటాయించు కుంటున్నారు. వివరాలు 8లో ▸





ఆస్తి కోసం దంపతుల హత్య!

సంగారెడ్డి జిల్లాలో ఆస్తి కోసం భార్యాభర్తలను కుటుంబ సభ్యులు హత్య చేశారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలు 8లో ▸



సిబ్బందిలేక ఇబ్బందులు

నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 22 మంది వైద్యులకు గాను పది మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు

ఎస్పీ బాలస్వామి



మెదక్ మున్సిపాలిటీ: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ బాలస్వామి సూచించారు. శుక్రవారం బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పండుగలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ పశువుల రవాణా నివారణకు జిల్లాలో మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని చెప్పారు. పశువుల రవాణా చేసే వారు అన్నిరకాల నిబంధనలు పాటించాలని సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా వాహనాలు తనిఖీ చేయాలని ఎస్పీ ఆదేశించారు.

ఎన్‌క్వాస్‌కు ఎంపికైన పీహెచ్‌సీ



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న శ్రీరామ్

పాపన్న పేట (మెదక్): నేషనల్ క్వాలిటీ అసూరెన్స్ స్టాండర్డ్స్ ప్రోగ్రాం క్రింద పొడిచన్ పల్లి పీహెచ్‌సీ ఎంపికై నట్లు జిల్లా వైద్య అధికారి శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం ఆయన డాక్టర్ నవీన్‌తో కలసి పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ స్కీం కింద ఎంపికై న ఆసుపత్రుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు అవుతాయని చెప్పారు. 20న నిర్వహించే నట్టల నివారణ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట దీక్ష, శ్రీనివాస్ రెడ్డి, ఇందిర, పల్లవి, భద్రప్ప, భూమేశ్ పాల్గొన్నారు.

రైతుభరోసా ఎప్పుడిస్తారు

ఎమ్మార్పీఎస్ నేత ప్రభాకర్

కొల్చారం(నర్సాపూర్): వానాకాలం పంట సాగుకు సిద్ధమవుతున్న రైతులకు పెట్టుబడి కింద ప్రభుత్వం ఇస్తామన్న రైతుభరోసా ఎప్పటికి ఇస్తారంటూ ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.15వేలు జమ చేస్తామని చెప్పినా ఇప్పటికీ అమలు కాలేదని వాపోయారు. రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

రెండు పాఠశాలల బస్సులు సీజ్

నర్సాపూర్: నర్సాపూర్‌లో ప్రైవేటు పాఠశాలల బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేశారు. పట్టణంలోని రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన రెండు బస్సులను అధికారులు సీజ్ చేసి ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఉంచారు. బస్సులు ఫిట్నెస్ సరిగా లేకపోవడం, సరైన డాక్యుమెంట్లు లేనందున సీజ్ చేశారని తెలిసింది.

విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్‌కు వెల్దుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు 8మంది ఎంపికయ్యారు. శుక్రవారం ఫలితాలు విడుదలయ్యాయి. వారికి ప్రతియేటా రూ.12వేలు చొప్పున 5ఏళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుందని హెచ్‌ఎం సాంబయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికై న విద్యార్థులు అక్షయ, శ్రీకీర్తన, శ్రీలేఖ, హర్షిత, మేఘన, దినేష్, ఈశ్వర్, రిశ్వంత్‌ను ఎంఈఓ యాదగిరి, ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటి గ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ పొందడానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయ అధికారి విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ నిర్వహించే సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీసర్కిల్ ద్వారా శిక్షణ ఇస్తున్నారని, ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 6281766534లో సంప్రదించాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

ప్రణాళికాబద్ధంగా పరిష్కారం

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, మెదక్ సిద్దిపేట జిల్లా కలెక్టర్లతో ధరణి సమస్యల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. మెదక్ సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక బద్ధంగా పరిష్కరించాలని సూచించారు. సక్సెషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ప్రతి మండలంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం లేదా భూమిని కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని తహసీల్దార్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీఓ రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి, నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఏవో యూనస్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గొర్రెలు కొన్నది ఎక్కడ?


బిల్లులు ఎవ్వరికి ఇచ్చారు

- పథకం అమలుపై విజిలెన్స్ ఆరా
- వారి బ్యాంకు ఖాతాల వివరాలివ్వండి
- పశుసంవర్ధకశాఖకు అందిన ఆదేశాలు
- జిల్లాలోనూ భారీగా అక్రమాలు!

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: గొర్రెల పంపిణీ పథకంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆరా తీసింది. జిల్లాలో ఈ పథకం అమలుకు సంబంధించిన పూర్తి సమాచారం పంపాలని ఆదేశించింది. గొర్రెలను ఎవరి వద్ద కొనుగోలు చేశారు..? వారి పూర్తి వివరాలను ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు మూడు ప్రత్యేక ఫార్మాట్లలో సమాచారాన్ని సేకరిస్తోంది. జిల్లాలో గొర్రెల కొనుగోలు కోసం ఎన్ని నిధులు ఖర్చు చేశారు..? ఆ నిధులను ఎవరి ఖాతాలో జమ చేశారు..? బ్యాంకు వివరాలు, ఖాతా నంబర్లు, బ్రాంచ్.. వివరాలతో కూడిన ఫార్మాట్‌ను పంపాలని ఆదేశించారు. ఈ పథకంపై ఇప్పటికే అవినీతి నిరోధకశాఖ దర్యాప్తు చేపట్టిన విషయం విదితమే. ఇప్పటికే పశుసంవర్ధకశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు పలువురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజిలెన్స్ నుంచి ఈ ఆదేశాలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పథకం అమలులో జిల్లాలో కూడా పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలుస్తోంది. గొర్రెలను కొనుగోలు చేయకుండానే కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో రాసి, నిధులు డ్రా చేశారనే ఆరోపణలున్నాయి. దళారులు, కొందరు అధికారులు కుమ్మక్కై నిధులు పక్కదారి పట్టించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

20,247 యూనిట్ల గొర్రెల పంపిణీ

జిల్లాలో ఈ పథకం కింద రెండు విడతల్లో కలిపి 20,247 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. మొదటి విడతలో 18,825 మంది లబ్ధిదారులకు గొర్రెలను అందజేయగా, రెండో విడతలో 1,422 మందికి ఈ యూనిట్లు అందజేశారు. ఒక్కో యూనిట్‌లో లబ్ధిదారునికి 20 గొర్రెలను, ఒక పొట్టేలును ఇస్తారు. ఒక్కో యూనిట్ వ్యయం రూ.1.25 లక్షలు కాగా, ఇందులో గొర్రెల రేటుతో పాటు, గొర్రెల దాణా, మందులు, ట్రాన్స్‌పోర్టు చార్జీలు కూడా ఇందులోనే ఉంటాయి.



జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కార్యాలయం

కొనకుండానే కొన్నట్లు..

ఈ గొర్రెలను కొనుగోలు చేసేందుకు మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు వెళ్లి గొర్రెలను కొనుగోలు చేశారు. ఈ క్రమంలో దళారులు రంగప్రవేశం చేశారు. చాలా యూనిట్లు కొనుగోలు చేయకుండానే కొన్నట్లు రికార్డుల్లో రాశారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో చేతులు మారాయి. ఈ కొనుగోలు కోసం జిల్లా నుంచి ప్రొక్యూర్‌మెంట్ టీంలను ఏర్పాటు చేశారు.

అధికారులు కుమ్మక్కు..

పశుసంవర్ధశాఖ అధికారుల పర్యవేక్షణలోనే ఈ గొర్రెలను కొనుగోలు ప్రక్రియ కొనసాగింది. ప్రొక్యూర్‌మెంట్ టీంలకు జిల్లాలోని పలువురు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. వీరు కూడా లబ్ధిదారులతో పాటు, ఆయా రాష్ట్రాలకు వెళ్లి గొర్రెలను కొనుగోలు చేసి తెచ్చారు. దీంతో ఈ వ్యవహారంలో అధికారుల హస్తం కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే విజిలెన్స్ విభాగం కూడా కొనుగోలు కోసం ఆయా రాష్ట్రాలకు వెళ్లిన అధికారుల వివరాలను కూడా పంపాలని ఆదేశించింది. దీంతో ఈ అక్రమాలతో సంబంధం ఉన్న అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఏడుపాయల దర్శనానికొచ్చి..

వనదుర్గా ప్రాజెక్టులో మునిగి వ్యక్తి మృతి



వినోద్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మ దర్శనం కోసం వచ్చిన భక్తుడు వన దుర్గా ప్రాజెక్టులో మునిగి మృతి చెందాడు. పాపన్నపేట ఎస్సై నరేశ్ కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన ఎస్లీ వినోద్ స్థానికంగా (48)వంట మనిషిగా పని చేస్తూ జీవనం కొన సాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం ఏడుపాయలకు వచ్చాడు. సాయంత్రం స్నానం చేసేందుకు వన దుర్గా ప్రాజెక్టులోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. ఎంత సేపటికీ బయటకు రాకపోయే సరికి కుటుంబీకులు స్థానికుల సాయంతో వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై నరేశ్ గజ ఈతగాళ్లను రంగంలోకి దించి వినోద్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పిడుగుపాటు బాధితులకు బీమా

వ్యవసాయ కార్మిక సంఘం నేతల డిమాండ్



మాట్లాడుతున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: పిడుగుపడి మృతి చెందిన బాధితులకు ప్రమాద బీమా చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం పోడు, సాగు భూములు, ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం కేవలం కిషన్ భవన్‌లో జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్, జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని, ధరణిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు వానకాలం పంట నుంచి రూ.12.500 చెల్లించాలని డిమాండ్ చేశారు. భూమిలేని వ్యవసాయ కూలీలు 1,26,400 మంది అభయహస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలు, కొత్త రేషన్ కార్డులు, పించన్లు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. గ్రామాలలో అంటువ్యాధులు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మాగౌడ్, ఐలయ్య, నాగమణి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కర్షకుల కోలా‘హలం’



ధర్మాసాగర్‌లో పత్తి వేసేందుకు ఎడ్లతో సాలు కొడుతున్న రైతు

మొదలైన వ్యవసాయ పనులు

- మండలంలో 19,060 ఎకరాలలో సాగు అంచనా
- 18,500 ఎకరాలలో వరి పంట
- 5,744మెట్రిక్ టన్నుల ఎరువులు..
- 1,448క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం

కౌడిపల్లి(నర్సాపూర్): రైతన్నలు సాగుబాట పట్టారు. పొలం పనుల్లో బిజీబిజీ అయ్యారు. ఈసారి దండిగా వర్షాలు కురుస్తాయనే ఆశతో దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వర్షాధార పంటల విత్తనాలు విత్తడం ప్రారంభించారు. వ్యవసాయ అధికారులు వానాకాలం సీజన్‌కు సంబంధించి సాగు ప్రణాళిక సిద్ధం చేసి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచారు.

పెరగనున్న సాగు విస్తీర్ణం

కౌడిపల్లి మండలంలో ఈ ఏడాది 19,060 ఎకరాలలో సాగు అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచానా వేశారు. గత ఏడాది 19వేల ఎకరాలలో సాగు చేయగా ఈసారి మరింత పెరిగే అవకాశం ఉంది. ఇందులో వరి పంట 18,500ఎకరాలు, పత్తి 400ఎకరాలు, మొక్కజొన్న 50ఎకరాలు, పొద్దుతిరుగుడు 10ఎకరాలు, కంది 10ఎకరాలు, కూరగాయలు 90ఎకరాలతోపాటు అంతర పంటగా పెసర, మినుము పంటలు సాగు కానున్నాయి. ఇందులో అధికంగా వరి పంట సాగు అవుతుండగా.. 997.6క్వింటాళ్ల దొడ్డురకం, 449.16క్వింటాళ్ల సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేశారు. ఇప్పటికే మండలంలోని భూసారం పెంచేందుకు జీలుగు, జనుము విత్తనాలు పంపిణీ చేశారు. రసాయన ఎరువులు 2502.36మెట్రిక్ టన్నుల యూరియా, 926మెట్రిక్‌టన్నుల డీఏపీ, 463మెట్రిక్ టన్నుల పొటాష్, 1,853మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరమని అధికారులు గుర్తించి సిద్ధం చేస్తున్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

రైతులకు ఇబ్బంది లేకుండా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేశాం. ఇప్పటికే కొన్నిచోట్ల వరి, పత్తి, ఇతర పంటల విత్తనాలు విత్తడం మొదలైంది. ఎరువులు సరిపడా పంపిణీ చేసేందుకు రెడీగా ఉన్నాం.

– స్వప్న, ఏఓ

16న విద్యా సదస్సుకు

తరలిరండి

టీపీటీఎఫ్ నాయకుడు తిరుపతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో ఈ నెల 16న నిర్వహించనున్న విద్యా సదస్సుకు తరలిరావాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి కోరారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట అర్బన్ మండల శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యా సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సుకు ఉపాధ్యాయులు, మేధావులు, విద్యా అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం, ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్కలు వక్తలుగా ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తనాలు మేలు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

- కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ దత్తాత్రేయ నల్కర్
- రైతులకు ఉచితంగా కంది విత్తనాల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): అధిక దిదుబడిని ఇచ్చే మేలైన విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలని కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ సంబాజి దత్తాత్రేయ నల్కర్, శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీన వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో రైతులకు కంది పంట సాగు, మెలకువలపై శిక్షణ ఇచ్చి ఉచితంగా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటల సాగులో నష్టపోకుండా ఉండేందుకు మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలన్నారు. విత్తనాలు వేసేముందుకు విత్తన శుద్ధి తప్పనిసరిగా పని చేయాలన్నారు.అనంతరం సీఎఫ్ఎల్‌డీ (క్లస్టర్ ఫ్రంట్‌లైన్ డెమాన్‌స్ట్రేషన్) కార్యక్రమంలో భాగంగా ఎంపికైన మండలంలోని ముత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన పది మంది రైతులకు మూడు కిలోల చొప్పున డబ్ల్యూఆర్‌జీఈ-97 రకం కంది విత్తనాలను ఉచింతంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మూగ వేదన

- శిథిలావస్థలో పశువైద్యశాలలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- అందుబాటులో లేని పాము, కుక్కకాటు మందులు

మెదక్‌జోన్ : మెతుకు సీమలోని 90శాతం ప్రజలకు వ్యవసాయమే ప్రధాన ఆధారం. ఇందులో కొందరు పాడి పశువులను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. అయితే పశువులకు సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. జిల్లాలో కొన్నిప్రాంతాల్లో పశు వైద్యశాలలు లేక జీవాలకు రోగాలు వస్తే ఎక్కడ చూపించాలో రైతులకు దిక్కుతోచడం లేదు. ఉన్నచోట చాలావరకు శిథిలావస్థకు చేరాయి. అంతేకాకుండా చాలాకాలంగా పశువైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రస్తుతం పశువులకు సీజనల్ వ్యాధులతో పాటు పాము, కుక్క కాటు ప్రమాదం పొంచిఉంది. వాటికి మందులు కూడా అందుబాటులో లేవు.

జిల్లా వ్యాప్తంగా నలుపు, తెలుపు జాతి పశువులు 2,79,019 ఉన్నాయి. వాటిలో ఆవు(తెల్ల)జాతి పశువులు 89,413 ఉండగా, గేదె(నల్ల) జాతివి 1,89,606 ఉన్నాయి. అలాగే గొర్రెలు 6,33,416 ఉండగా, మేకలు 1,52,770 ఉన్నాయి. వీటి ఆరోగ్య భద్రత కోసం జిల్లాలో 3 ప్రాంతీయ పశువైద్యశాలలు, 29 పశు వైద్యకేంద్రాలు, 35 సబ్‌సెంటర్లు, రెండు సంచార పశువైద్య శాలలు ఏర్పాటు చేశారు. అయితే లెక్కలు చెప్పడానికి బాగానే ఉన్నా, ఆచరణలో మాత్రం శూన్యం.

పాము, కుక్క కాటు మందులు ప్రైవేట్‌లో కొనుగోలు చేయాలంటే ఒక్కో డోస్ రూ. 500 నుంచి రూ.760 అవుతుండటం పశుపోషకులకు భారంగా మారింది. అంతే కాకుండా మూగజీవాలకు ఏ చిన్నపాటి వైద్యం చేయాల్సి వచ్చినా మందులు ప్రైవేట్‌గా తెచ్చుకోవాలని సర్కార్ వైద్య సిబ్బంది చెబుతున్నారని పాడి రైతులు పేర్కొంటున్నారు.



శిథిలావస్థకు చేరిన జిల్లా కేంద్రంలోని పశువైద్యశాల

శిథిలావస్థలో పశు వైద్యశాలలు

జిల్లాలోని పశువైద్య భవనాలు చాలావరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో ప్రధానంగా మెదక్ జిల్లా కేంద్రంలోని పశువైద్యశాల భవనం అస్తవ్యస్తంగా ఉంది. పై కప్పు నుంచి పెచ్చులూడి పడుతుండటంతో ఇందులో సిబ్బంది కూర్చోవాలంటేనే జంకుతున్నారు. అలాగే రామాయంపేట మున్సిపల్ కేంద్రం, హవేళిఘనాపూర్ మండలంలోని భూర్గుపల్లి, సర్దన, కొల్చారం మండలం అంసాన్‌పల్లి, కంచన్‌పల్లి, చేగుంట మండలం మక్కరాజిపేట, చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి ఇలా అనేక మండలాల్లో పశువైద్యశాఖలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇవి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

పశువైద్య సిబ్బంది వివరాలు

సిబ్బంది/క్యాడర్	మొత్తం	పనిచేయుచున్నవారు	ఖాళీలు
ఉప సంచాలకులు	1	1	0
సహాయసంచాలకులు	5	5	0
వైద్యసహాయ శస్త్రచికిత్సకులు	30	18	12
వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్లు	6	5	1
జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు	10	10	0
లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు	20	4	16
వెటర్నరీ అసిస్టెంట్లు	28	18	10
అటెండర్లు	54	53	1
	154	114	40

తీవ్రంగా సిబ్బంది కొరత

పశుసంవర్ధ శాఖలో చాలా కాలంగా సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఎక్కువ శాతం ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. ఉప సంచాలకులు, సహాయ సంచాలకులు, పశు వైద్య సహాయ శస్త్రచికిత్సకులతో పాటు ఇతర సిబ్బంది మొత్తం 154 పోస్టులున్నాయి. ఇందులో 114 మంది విధులు నిర్వర్తిస్తుండగా.. 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు శిక్షణ

సంగారెడ్డి టౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ పొందేందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి యం.ఫిరంగి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించరాదని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీలోగా http//rtudycirce.cff.gov.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 6281766534 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మగ్గం వర్క్‌పై ఉచిత ట్రైనింగ్

సంగారెడ్డి టౌన్: మగ్గం వర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మహిళలకు జూన్ 25నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని, దీంతోపాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు సంగారెడ్డి బైపాస్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9490129839 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

క్లుప్తంగా

ఇక మీ సేవల్లో 'క్యూఆర్‌ కోడ్‌'

● చెల్లింపులపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

పుల్‌కల్‌(అందోల్‌): ఈ నెలాఖరు నుంచి మీ సేవా కేంద్రాల్లో వినియోగదారుల నుంచి 'క్యూఆర్‌ కోడ్‌' ద్వారానే చెల్లింపులు జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఈ–డిస్ట్రిక్ట్‌ మేనేజర్‌ ఉదయ్‌కుమార్‌ కేంద్రం నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం ఈఎస్‌డీ మేనేజర్‌ ప్రదీప్‌కుమార్‌తో కలిసి జిల్లా మీసేవా కేంద్రాల నిర్వాహకులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ నెల 25 నుంచి మీసేవా కేంద్రాల్లో ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసే వారు 'క్యూఆర్‌ కోడ్‌' ద్వారా చెల్లింపులు చేయాలని సూచించారు. పారదర్శకత కోసమే ప్రభుత్వం క్యూఆర్‌ కోడ్‌ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని మీసేవా కేంద్రాలను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ ఆధార్‌ కేంద్రం ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్వహించాలని తెలిపారు.

ఐదు బస్సులు సీజ్‌

ఎంవీఐ విజయరావు



వాహనపత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ విజయరావు

పటాన్‌చెరు టౌన్‌: విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో స్పెషల్‌ డ్రైవ్‌ పేరిట రవాణాశాఖ అధికారులు స్కూల్‌ బస్సులను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం బీరంగూడ నుంచి కిష్టారెడ్డి పేట వైపు వెళ్లే దారిలో విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ విజయరావు మాట్లాడుతూ... విద్యాసంస్థలకు చెందిన ఐదు బస్సులను ఫిట్‌ నెస్‌ సరిగా లేని కారణంగా సీజ్‌ చేసినట్లు తెలిపారు.

సురేశ్‌ షెట్కార్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

గిరిజన సంఘాల నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

నారాయణఖేడ్‌: జహీరాబాద్‌ ఎంపీ సురేశ్‌ షెట్కార్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి కేటాయించాలని కాంగ్రెస్‌ రాష్ట్ర గిరిజన నాయకులు ప్రకాశ్‌ రాథోడ్‌, నారాయణఖేడ్‌ నియోజకవర్గ ఎస్టీ సెల్‌ నాయకులు నెహ్రూ నాయక్‌లు కోరారు. శుక్రవారం ఖేడ్‌లో విలేకర్లతో మాట్లాడారు. సురేశ్‌ షెట్కార్‌, తాత, తండ్రి స్వాతంత్ర్య సమరయోధులని, కాంగ్రెస్‌లోనే ఏడు దశాబ్దాలకు పైగా పని చేస్తున్న కుటుంబం అన్నారు. షెట్కార్‌ ఎస్సీ, ఎస్టీలతోపాటు బీసీ, మైనార్టీల కోసం నిరంతరం పాటు పడతారన్నారు. కాబట్టి ఆయనకు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలన్నారు. సమావేశంలో గిరిజన సంఘాల నాయకులు, కాంగ్రెస్‌ నాయకులు సర్దార్‌ నాయక్‌, బస్వరాజ్‌ పటేల్‌, ప్రేమ్‌సింగ్‌, మోహన్‌ నాయక్‌, దేవిదాస్‌, నారాయణ, గోపాల్‌, హన్మంతు, తదితరులు కోరారు.

ప్రధానోపాధ్యాయుడికి డాక్టరేట్‌



డాక్టరేట్‌ అందుకుంటున్న తుల్జయ్య

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): మండల పరిధిలోని తంగడపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌.తుల్జయ్యకు సామాజిక సేవా రంగంలో చేసిన సేవలకు గాను ఫ్రెండ్షిప్‌ మినిస్ట్రీస్‌ సంస్థ గౌరవ డాక్టరేట్‌ను అందించింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంస్థ అధ్యక్షుడు డా.ఆలూరి విల్సన్‌, సెక్రటరీ డా.ఇందిరా, నటుడు డా.రాం మాణిక్‌ చేతుల మీదుగా డాక్టర్‌ ఆఫ్‌ సోషల్‌ సర్వీస్‌ అవార్డు 2024ను అందుకున్నారు. తుల్జయ్యకు డాక్టరేట్‌ అవార్డు రావడంపై మండల విద్యాధికారి శంకర్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

హుస్నాబాద్‌ మున్సిపాలిటీలో

ఇంటి నంబర్ల బాగోతం

నకిలీ డాక్యుమెంట్లతో ఇంటి నంబర్లు, విద్యుత్‌ మీటర్లు

కాగితాల్లోనే సమాచారం ● మున్సిపల్‌ రిజిస్టర్‌లో కనిపించని నంబర్‌

ఫోర్జరీ సంతకాలా.. అధికారుల అండతోనా! ● ఖాళీ జాగా కనబడితే కబ్జా

❐ పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఓ ఇంటిని అనుకొని ఉన్న స్థలంపై ఆ ఇంటి వెనుకాల ఉన్న ఓ వ్యక్తి కన్నేశాడు. అదే ఇంటి నంబర్‌ తెలుసుకొని బై నంబర్‌ వేయించి ఖాళీ స్థలానికి ఇంటి నంబర్‌ కేటాయించడం, ఈ ఆధారంతో సబ్‌ రిజిస్టర్‌ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్‌ చేసుకోవడం చకచకా జరిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఇంటి యజమాని పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, తర్వాత ఏమైందో ఏమో రిజిస్ట్రేషన్‌ చేయించుకున్న వ్యక్తి మున్సిపల్‌ ఆఫీస్‌కు వచ్చి పొరపాటున ఇంటి నంబర్‌ కేటాయించారని క్యాన్సలేషన్‌ చేయాలని దరఖాస్తు చేసుకోగా ఇంటి నంబర్‌ను రద్దు చేశారు.

❐ పట్టణంలోని 608 సర్వే నంబర్‌లోని ఖరీదైన ప్లాట్‌ను ప్రభుత్వం మాకు ఇచ్చిందని ఓ వ్యక్తి నకిలీ డాక్యుమెంట్లతో ఇంటి నంబర్‌ కేటాయించుకొని విద్యుత్‌ మీటర్‌ను కూడా ఇప్పించుకున్నాడు. దీనిపై కొందరు ఫిర్యాదు చేయగా, కేటాయించిన ఇంటి నంబర్‌ మున్సిపల్‌ రికార్డులో లేదని తేలింది. అలాగే రెవెన్యూ అధికారులకు సైతం ఫిర్యాదు చేయగా, ఈ ప్లాట్‌ ఎలా వచ్చింది, ఎవరు ఇచ్చారో విచారణకు రావాలని నోటీసులు అందచేశారు. ఇంటి నంబర్‌ కేటాయించింది అధికారా లేదా ఫోర్జరీ సంతకమా అనేది విచారణ జరుగుతుందని తెలుస్తోంది.

హుస్నాబాద్‌: హుస్నాబాద్‌ పట్టణంలో ఎక్కడ ఖాళీ జాగా కనబడితే చాల కబ్జా పాలవుతుంది. అధికారుల అండదండలతో ఇంటి నంబర్లు కేటాయించి విద్యుత్‌ మీటర్లు బిగించుకుంటున్నారు. వీటితోపాటు సబ్‌ రిజిస్టర్‌ ఆఫీసుకెళ్లి జాగను రిజిస్ట్రేషన్‌ చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించేకోని పరిస్థితి నెలకొంది.

ఇంటి నంబర్లు కాగితాలపైనే ..

ఖాళీ స్థలం కనబడగానే చుట్టు పక్కల వారితో వివరాలు సేకరించడం, తదనంతరం ఇంటి నంబర్లు వేసుకుంటూ అక్రమాలకు తెర తీస్తున్నారు. ఇంటి నంబర్లు కాగితాలపైనే ఉంటాయే తప్ప మున్సిపల్‌ రిజిస్ట్రర్‌లో ఉండకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారుల అండతోనా లేదా ఫోర్జరీ సంతకాలతో ఇంటి నంబర్లు కేటాయింపులు జరుగుతున్నాయా అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు లేకున్నా ఇంటి నంబర్లు, ఇంటి నంబర్లతో సంబంధం లేని భూములను రిజిస్ట్రేషన్‌ చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇంటి నంబర్‌కు సంబంధించి ప్రొసీడింగ్‌లో కమిషనర్‌ సంతకం పెట్టాడా.. లేకపోతే సంతకాల ముద్రలు ఎక్కడి నుంచి వస్తున్నాయి.. లేదంటే కమిషనర్‌ సంతకం పెట్టిన రిజిస్టర్‌లో ఇంటి నంబర్‌ ఎందుకు నమోదు చేయడం లేదని సవాలక్ష ప్రశ్నలు ప్రజల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. ఇందులో కొందరి ప్రజాప్రతినిధుల హస్తం ఉందని ప్రచారం జరుగుతుంది.

ఏ ఆధారం లేకుండా విద్యుత్‌ మీటర్‌..

మున్సిపల్‌ అధికారులు ధ్రువీకరించిన పత్రాలు సరైనవేనా లేదా అని చూడకుండా మాకు ఫీజు వస్తే చాలన్నట్లుగా సబ్‌ రిజిస్టర్‌ అధికారులు స్థలాలను రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. మున్సిపల్‌ అధికారులు ఫలాన ఇంటి నంబర్‌కు విద్యుత్‌ మీటర్‌ ఇవ్వాలని విద్యుత్‌ అధికారులకు ప్రొసీడింగ్‌ పంపిస్తున్నారు. విద్యుత్‌ అధికారులు తప్పకుండా మున్సిపల్‌ నుంచి ఇంటి నిర్మాణ అనుమతి పత్రం, ఇంటి పన్ను , నల్లా పన్ను కట్టినట్లు రసీదు చూపిస్తేనే ఆ ఇంటికి విద్యుత్‌ మీటర్‌ ఇవ్వాల్సి ఉంటుంది. విద్యుత్‌ అధికారులు కూడా మున్సిపల్‌ అధికారులు విద్యుత్‌ మీటర్‌ ఇవ్వమన్నారని ఏ ఆధారం లేకుండా గుడ్డిగా ఇస్తున్నారు. అధికారులు ఈ అక్రమాలపై లోతుగా పరిశీలిస్తే మర్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



మున్సిపల్‌ కార్యాలయ భవనం

నగర పంచాయతీ అప్‌గ్రేడ్‌ నుంచి ...

మేజర్‌ గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా, మున్సిపల్‌గా అప్‌గ్రేడ్‌ అయినప్పుడు కూడా పాత తేదీల్లో అప్పటి అధికారుల సంతకాలతో ఇంటి మార్పిడి, ఇంటి నంబర్లు కేటాయింపులు జరిపి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్‌ పరిధిలో ప్రభుత్వానికి సంబంధించి భూములు ఉన్నాయి. ఆ భూములను ఇతరులు కబ్జా చేసే వరకు ఈ భూములు ప్రభుత్వానివని అధికారులకు తెలియడం లేదు. మున్సిపల్‌కు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్న అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

విచారణ జరుపుతున్నాం



పట్టణంలోని 608 సర్వే నంబర్‌లోని కొంత స్థలానికి ఓ వ్యక్తి అక్రమంగా ఇంటి నంబర్‌ పొందాడని ఫిర్యాదు వచ్చింది. ఈ స్థలానికి ఇంటి నంబర్‌తో పాటు కరెంట్‌ మీటర్‌ బిగించారు. కానీ ఆ ఇంటి నంబర్‌ మున్సిపల్‌ రికార్డులో నమోదు కాలేదు. ఇంటి నంబర్‌ జారీలో పత్రంలో అధికారి సంతకం పెట్టింది నిజమేనా అని సంబంధిత అధికారికి లిఖిత పూర్వకంగా సమాచారం అందించాం. ఆ అధికారి సమాధానంతో సంతకం నిజమేనా కాదా అనేది స్పష్టం కానుంది.

– మల్లికార్జున్‌, మున్సిపల్‌ కమిషనర్‌, హుస్నాబాద్‌

ఊబ చెరువు కట్ట ధ్వంసం వాస్తవమే

తేల్చిన రెవెన్యూ, మున్సిపల్‌, ఇరిగేషన్‌ అధికారులు



వెంచర్‌ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

సదాశివపేట (సంగారెడ్డి): పట్టణంలోని ఊబ చెరువు కట్టను అక్రమంగా ధ్వంసం చేసి వెంచర్‌కు రోడ్డు నిర్మాణం చేస్తున్న విషయం వాస్తవమేనని రెవెన్యూ, ఇరిగేషన్‌, మున్సిపల్‌ టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు తేల్చారు. ఈ నివేదికను సైతం జిల్లా ఉన్నతాధికారులకు పంపించనున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని సర్వే నంబర్‌ 399లో ఊబ చెరువు కట్టకు దిగువన ఏడు ఎకరాల భూమిలో అప్రోచ్‌ రోడ్డు లేకపోయినా ఫైవ్‌మెన్‌ కమిటీ రిపోర్టు మేరకు డీటీసీపీ అనుమతులు వచ్చాయి. సంజీవని లేక్‌ సిటీ వెంచర్‌ యజమానులు కట్టను అక్రమంగా ధ్వంసంచేసి వెంచర్‌ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ విషయంలో మత్స్యకారులు వెంచర్‌ యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. దీంతో టీజేఎస్‌ జిల్లా చైర్మన్‌ కొత్తగొల్ల సత్తయ్యయాదవ్‌, సీపీఎం నాయకులు గురువారం వేర్వేరుగా కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు శుక్రవారం తహసీల్దార్‌ సరస్వతీ, ఇరిగేషన్‌ అధికారి మహేశ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ ఉమా కట్టను పరిశీలించారు. అక్రమంగా సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టిన విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్‌ వివరించారు.

డీవైఎఫ్‌ఐ నాయకులు పరిశీలన

డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఊబ చెరువు మినీట్యాంక్‌ బండ్‌ కట్టను, రోడ్డు వేస్తున్న స్థలాన్ని శుక్రవారం నాయకులు పరిశీలించారు. కట్టను ధ్వంసం చేసి వెంచర్‌కు అక్రమంగా రోడ్డు వేస్తున్న సంజీవని లేక్‌ సిటీ వెంచర్‌ యజమానులపై చర్యలు తీసుకొని, అనుమతులు రద్దు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనీల్‌ డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి శ్రీకాంత్‌, నాయకులు ప్రశాంత్‌, రవి, రమేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోండి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింలు

కొండాపూర్‌(సంగారెడ్డి): అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవడంతోపాటు వాటిలోకి అక్రమంగా తరలిస్తున్న మట్టిని అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింలు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన కొండాపూర్‌లో తహసీల్దార్‌ అనితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నర్సింలు మాట్లాడుతూ.. మండల పరిధిలోని మాందాపూర్‌ గ్రామంలో సర్వే నంబర్‌ 98లో అసైన్డ్‌ భూముల గుట్టల నుండి అక్రమంగా వెంచర్లకు మట్టిని తరలిస్తున్నారన్నారు. అలాగే, మండలంలో మునిదేవునిపల్లి, సీహెచ్‌ కోనాపూర్‌ లోనూ గుట్టల నుంచి అక్రమంగా మట్టిని అమ్ముకుంటున్నారన్నారు. వీటిని వెంటనే సంబంధిత అధికారులు పరిశీలించి ఆపాలని డిమాండ్‌ చేశారు.



అనితకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వ్యవసాయ భూములు వెంచర్లుగా మారుతున్నాయని, అనుమతులు లేకున్నా వెంచర్లను నిర్వహిస్తూ ప్లాట్లను అమ్ముతూ లాభాలు గడిస్తున్న రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజయ్య, నర్సింహా రెడ్డి, సంజీవయ్య, రవికుమార్‌, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరణి భూ సమస్యలను పరిష్కరించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

కొండాపూర్‌(సంగారెడ్డి): జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన కొండాపూర్‌లో సీపీఎం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 17 వేలకు పైగా ధరణి భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, అత్యధికంగా సన్న, చిన్నకారు రైతులవేనని పేర్కొన్నారు. ధరణి సమస్యలు పరిష్కారం కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా ధరణిలో రైతుల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. మండలంలో అసైన్డ్‌ భూములు కబ్జాలకు గురవుతున్నాయని అన్నారు. అలాగే, విత్తనాలు, ఎరువుల సమస్య పరిష్కారం చేయడంతోపాటు అక్రమంగా నీళ్లను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.నర్సింలు, మండల కార్యదర్శి రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

జిన్నారంలో వ్యక్తి మృతి



గణేశ్‌ (ఫైల్‌)

జిన్నారం(పటాన్‌చెరు): అతివేగంగా వచ్చిన కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గుమ్మడిదల గ్రామ ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం మేరకు.. గుమ్మడిదల గ్రామానికి చెందిన కాశబోయిన గణేశ్‌(26) బైక్‌ మెకానిక్‌. శుక్రవారం ఉదయం బంధువుల ఫంక్షన్‌కు వెళ్లాడు. తిరిగి తెల్లవారుజామున 3 గంటల సమయంలో కారులో గుమ్మడిదలకు వస్తున్నాడు. అతివేగంగా డ్రైవ్‌ చేస్తుండటంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గణేశ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా : పలువురికి తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్‌): ఆటో బోల్తా పడటంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లి మండలంలోని కోనాయిపల్లి గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కోనాయిపల్లి గ్రామం నుంచి కుకునూరుపల్లికి ఆటో ప్రయాణికులతో వెళ్తుంది. కోనాయిపల్లి శివారులో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జగదీశ్వరీ, శ్రీదేవికి చేతులు విరుగగా, మంజుల, డ్రైవరు యాదయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది మహేందర్‌, మల్లేశ్‌ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

తూప్రాన్‌: డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన పట్టణ సమీపంలోని పెద్ద చెరువు కట్ట సమీపంలో రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన భూమేశ్‌ తూప్రాన్‌కు పనుల నిమిత్తం వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చెరువుకట్ట సమీపంలోకి బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిందితుల అరెస్టు

నకిలీ పత్రాలు సృష్టించి భూమి కబ్జా

సిద్దిపేటకమాన్‌: నకిలీ పత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని చూసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సిద్దిపేట వన్‌ టౌన్‌ సీఐ లక్ష్మీబాబు కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం ఇందిరానగర్‌కు చెందిన మహ్మద్‌ నసిరుద్దీన్‌, గౌసియాబేగం భార్యాభర్తలు. పట్టణంలోని మినీ స్టేడియం ఎదురుగా ఏఎఫ్‌సీ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నారు. దీని పక్కనే పట్టణానికి చెందిన బెల్లల నారాయణకు కొంత ఖాళీ స్థలం ఉంది. ఈ భూమిని కాజేయాలనే ఉద్దేశ్యంతో నసిరుద్దీన్‌ 2022లో హరిరాములు పేరు మీద నుంచి గౌసియా బేగం కొనుగోలు చేసినట్లుగా నకిలీ ఒప్పంద పత్రాలు సృష్టించాడు. ఆ పత్రాలతో రిజిస్ట్రేషన్‌ అధికారుల సాయంతో నసీరుద్దీన్‌, గౌసీయాబేగంలు తమ కుమారుడైన షఫీయుద్దీన్‌ పేరు మీద స్థలాన్ని రిజిస్ట్రేషన్‌ చేయించారు. తర్వాత ఆ స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండా షెడ్‌ను నిర్మించారు. ఆ నకిలీ పత్రాలతో ఉగ్రో బ్యాంక్‌లో రూ.50లక్షల రుణం తీసుకున్నారు. విషయం తెలుసుకున్న బాధితుడు స్థలం వద్దకు వెళ్లి అడుగగా నిందితులు నారాయణపై కర్రలతో దాడి చేశారు. నారాయణ గత జనవరిలో పోలీసులకు ఫిర్యాదు చేయగా సిద్దిపేట వన్‌ టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులైన తండ్రి, కుమారుడు మహ్మద్‌ నసిరుద్దీన్‌, షఫీయుద్దీన్‌లను అరెస్టు చేయగా, గౌసియా బేగం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు ఇళ్లల్లో చోరీ

రూ.5.80 లక్షలు, బంగారం అపహరణ



ఆధారాలు సేకరిస్తున్న ఎస్‌ఐ శ్రీకాంత్‌

సంగారెడ్డి: మండల కేంద్రం చౌటుక్కుర్‌ గ్రామంలో గురువారం అర్ధరాత్రి మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది. పుల్కల్‌ ఎస్‌ఐ శ్రీకాంత్‌ కథనం మేరకు..గ్రామానికి చెందిన శంకరయ్య, యశోద, రాధయ్య ముగ్గురిలో ఇళ్లలో నగదు, బంగారం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. శంకరయ్య ఇంట్లో రూ.లక్షా 80 వేలు, రెండు తులాల బంగారం, యశోద ఇంట్లో రూ.2 లక్షలు, రెండున్నర తులాల బంగారం, రాధయ్య ఇంట్లో రూ.2 లక్షలు, మూడు తులాల బంగారం దొంగిలించారని వివరించారు. దొంగలను పట్టుకునేందుకు టోల్‌గేట్‌ వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీకాంత్‌ వెల్లడించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో క్లినిక్‌ దగ్ధం



కాలిబూడిదైన పరికరాలు

చిన్నశంకరంపేట(మెదక్‌): విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో ఆర్‌ఎంపీ క్లినిక్‌ దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామలింగం నిర్వహిస్తున్న క్లినిక్‌లో పొగలు వస్తున్నాయని చుట్టుపక్కలవారు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు ఎగిసిపడి అప్పటికే క్లినిక్‌లోని విలువైన పరికరాలు, మందులు, రూ.30వేల నగదు కాలి బుడిదైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు రామలింగం కోరారు.

ఆస్తి కోసం దంపతుల హత్య!

● కుటుంబ సభ్యులపైనే అనుమానాలు
● పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
● జంట శవాల ఆచూకీ లభ్యం
● సంగారెడ్డి జిల్లా వాసులుగా గుర్తింపు



కిష్టయ్య (ఫైల్‌)



నర్సమ్మ (ఫైల్‌)

నర్సాపూర్‌: నర్సాపూర్‌లో గత నెల 22న గుర్తించిన జంట శవాల ఆచూకీని శుక్రవారం పోలీసులు గుర్తించారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సాదుల్లానగర్‌కు చెందిన చాకలి కిష్టయ్య(80), అతడి భార్య నర్సమ్మ(75)గా పోలీసుల విచారణలో తేలింది. ఆస్తి కోసం భార్యాభర్తలను కుటుంబ సభ్యులు హత్య చేశారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దంపతులిద్దరినీ అదే జిల్లాలోని గుమ్మడిదల్ల మండలం దోమడుగు గ్రామానికి తీసుకుపోయారని, అక్కడ వారి మధ్య ఆస్తి కోసం ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఈ గొడవలో నర్సమ్మ ఒంటిపై నగలు తీసుకొని ఇద్దరినీ హత్య చేసి వారి శవాలకు నిప్పంటించి అనంతరం నర్సాపూర్‌ పట్టణ శివారులోని చెరువు కట్ట కింద పాడేసినట్లు తెలిసింది. ఈ కేసులో నిందితులను అదుపులోకి విచారించగా ఇద్దరినీ హత్య చేసినట్లు అంగీకరించారని, త్వరలోనే పోలీసులు నిందితులను బయట పెట్టే అవకాశం ఉందని సమాచారం.

ఒకేషనల్‌ కోర్సులతో ఏకైక పాఠశాల



పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న రజిత

మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ ఆకుల రజిత

హుస్నాబాద్‌: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకానికి ఎంపికై ఒకేషనల్‌ కోర్సులు కలిగిన ఏకై క పాఠశాల హుస్నాబాద్‌ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల అని మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌ బుక్‌లు, స్కూల్‌ డ్రెస్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. హుస్నాబాద్‌ మండలంలో ఒకేషనల్‌ కోర్సులు కలిగిన ఏకైక పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అత్యున్నత సైన్స్‌ ల్యాబ్‌, కంప్యూటర్‌ ల్యాబ్స్‌, డిజిటల్‌ బోర్డులతో చక్కటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేట్‌ పాఠశాలల్లో చేర్చి డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ ఛైర్‌పర్సన్‌ అయిలేని అనిత, కౌన్సిలర్‌ దొడ్డి శ్రీనివాస్‌, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌ వేముల మంజుల, పాఠశాల హెచ్‌ఎం ఎస్‌. వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, 47 మంది లబ్ధిదారులకు కల్యాణ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్‌ మల్లికార్జున్‌, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

● మంచానబారిన ఉద్యమ కారుడు
● కాలేయ సంబంధ చికిత్సకు రూ.35 లక్షలు అవసరం
● మరోచోట ఊపిరితిత్తుల సమస్యతో యువకుడు



ముల్క శ్రీనివాస్‌



ఆస్పత్రిలో శేఖర్‌

వెల్దుర్తి(తూప్రాన్‌): తెలంగాణ మలిదశ ఉద్యమంలో మండలంలో చురుకుగా పాల్గొన్న ఓ ఉద్యమకారుడు నేడు కాలేయ సంబంధిత వ్యాధితో మంచం బారినపడ్డాడు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉన్నా ఇప్పటివరకు వైద్యం కోసం సుమారు రూ.10 లక్షలకు పైగా ఖర్చుచేసినా ఒంటరిగా కాలు మెదపలేని పరిస్థితి. ప్రతి నెలా కేవలం మందులకే సుమారు రూ.70 వేలు ఖర్చు అవుతున్నాయంటే అతడి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాలేయ మార్పిడి శస్త్రచికిత్సకు రూ.35 లక్షలకు పైగా ఖర్చువుతుందని వైద్యులు తెలపడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

మండల కేంద్రం వెల్దుర్తికి చెందిన ముల్క శ్రీనివాస్‌ తెలంగాణ మలి దశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. గ్రామాల్లో నిర్వహించిన ఆందోళన కార్యక్రమాలు, మాసాయిపేట జాతీయ రహదారిపై నిర్వహించిన ధర్నా, రాస్తారోకో, రైల్‌రోకో వంటి కార్యక్రమాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి పాల్గొన్నారు. టీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడిగా కూడా గతంలో పనిచేశాడు. శ్రీనివాస్‌ భార్య లక్ష్మి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జరిగిన ఎన్నికల్లో జెడ్పీటీసీ సభ్యురాలుగా గెలుపొందారు. పద్నాలుగు నెలల కింద అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలయ్యాడు. పరీక్షించిన వైద్యులు కాలేయం పూర్తిగా దెబ్బతిందని, శస్త్ర చికిత్సకు రూ.35లక్షలు ఖర్చవుతాయని చెప్పారు. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్న కుటుంబానికి వైద్య ఖర్చులు భారంగా మారాయి. శస్త్రచికిత్సకు అయ్యే ఖర్చులను పార్టీ పరంగానైనా ఆదుకోవాలని మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌, దాతలను విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్న వయసులో పెద్ద కష్టం

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): చిన్న వయసులోనే కన్న కొడుకు అనారోగ్యం పాలవడంతో తల్లిదండ్రులు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రూ.లక్షలు ఖర్చు చేసినప్పటికీ నయం కాలేదు. పైగా మరికొంత డబ్బు కావాల్సి రావడంతో దాతల సాయం కోరుతున్నారు. జగదేవ్‌పూర్‌ మండలంలోని రాంనగర్‌ గ్రామానికి చెందిన కోట సత్తమ్మ, కనకయ్య దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కూతురికి పెళ్లి చేయగా ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు శేఖర్‌(23)పదవ తరగతి వరకు చదివి ఇంటి వద్దనే ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఉన్నట్లు ఉండి శేఖర్‌ అనారోగ్యం పాలయ్యాడు. పది రోజుల కిందట హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించగా పరీక్షించిన వైద్యులు ఉపరితిత్తుల (లంగ్స్‌) సమస్య ఉందని చెప్పారు. ఇప్పటి వరకు చికిత్స కోసం రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ వ్యాధి నయం కావడానికి రూ.50 నుంచి రూ.60 లక్షల వరకు ఖర్చు అవుతాయని చెప్పారు. పేద కుటుంబం కావడంతో దాతలు ఎవరైనా సాయం చేయాలని కోరుతున్నారు. సాయం అందించే వారు సెల్‌ నంబర్‌కు 7893103631కుఫోన్‌ పే చేయాలని కోరుతున్నారు.